కాటమయ్య రక్షణ కవచంపై శిక్షణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 16: ఆరె పల్లి గ్రామంలో జిల్లా ఎక్సైజ్ అధికారి పీ శ్రీనివాస్ రావు, బీసీ సంక్షేమ అధికారి జీ అనిల్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం (సెఫ్టీమోకు) పై పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా రాక్, మౌంటెన్ క్లైంబింగ్ శిక్షకుడు రాజు, కాటమయ్య రక్షణ కవచం ఉపయోగించే విధానం, మెళకువలపై గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ భాస్కర్, ఎక్సైజ్ సిబ్బంది, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల పోస్టు కార్డు ఉద్యమం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 16 : పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దని జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లోని అన్ని ఆర్యవైశ్య అభ్యుదయ, జిల్లా ఆర్యవైశ్య సంఘాలు పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును యథావిధిగా ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పోస్ట్ కార్డు ద్వారా కోరారు.

IN THE COURT OF THE PRINCIPAL DIST JUDGE AT MULUGU

I A. No. 101 of 2023
in OS No. 156 of 2022

Mozaffer Omer khan ...Petitioner/ Def. No.6
And
T. Gopichand & others ...Respondents

To,
1. Syeda Mazhar Siddiqui W/o Md. Fasiuddin Moin, Aged about: 66 years, occp; Partner, R/o Flat No. 202, Ansari Enclave, Hanumannagar, Mehidipatnam, Hyderabad. R.No.3.
2. Mir Maqsoos Latif Abbasi, S/o Latifuddin, Aged about: 75 years, Occp: Partner, R/o H.No. 2-7-550, Mukarampura, Karimnagar District. R. No.4.
3. Pindi Ravi S/o Lingaiah, Aged about: 65 years, Occp: EX. Sarpanch. R/o Mallampally Village, Mulugu District. R.No. 6.

NOTICE

Please take notice that the petitioner/ Defendant No .6 filed a petition in this case to reopen his evidence and also filed his affidavit in lieu of chief examination. The same is posted to 05-9-2024 for your notice. There fore, You are here by summoned to appear in the above said court either in person or through an advocate on the above said date by 10.30 AM. Failing which the matter will be heard and decided in your absence.

(By order of the court)
Sd/- M.VENKATESHWAR RAO
ADVOCATE, MULUGU. Cell: 9963060968.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

WANTED

jobs Apply Now!

★కరీంనగర్ జిల్లా సిర్పూర్‌లో పని చేయడానికి Ex Service Men సెక్యూరిటీ సిబ్బంది కావలెను. నెలకు జీతం: 22,000/- నుండి 35,000/- వరకు, వయస్సు: 50 సం||లోపు. Trained సెక్యూరిటీ సిబ్బంది కావలెను. నెలకు జీతం: 19,000/- నుండి 26,000/- వరకు, అర్హత: 10వ తరగతి నుండి డిగ్రీ వరకు. బ్యాచిలర్ వసతి కలదు. వయస్సు: 20-40 సం||లోపు. ESI, PF కలదు. హైదరాబాద్‌లో పని చేయడానికి ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. జీతం: 25,000/- + పెట్రోల్. సెల్ నెం: 8341038715 / 9848328701 / 8919606707.
NT-98210

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

నగరంలోని మహాశక్తి ఆలయంలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రామడుగు: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ హైస్కూల్‌లో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

వరలక్ష్మీ నమోస్తుతే

- జిల్లా వ్యాప్తంగా వైభవంగా వ్రతాలు, కుంకుమార్చనలు

కమాన్‌చౌరస్తా/వీణవంక/శంకరపట్నం/రామడుగు/ హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 16 : జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలతో శ్రావణ శుక్రవారం వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో అర్చనలు జరిపించి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని చైతన్యపురి మహాశక్తి దేవాలయం, యజ్ఞవరాహస్వామి క్షేత్రంలోని మహాలక్ష్మీ ఆలయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పోటెత్తారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో మొక్కులు చెల్లించేందుకు మహిళలు బారులు తీరారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, మేయర్ సతీమణి అపర్ణాసునీల్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమాన్ రోడ్డు రామేశ్వరాలయంలో కుంకుమార్చనలు, పర్వతవర్ధినీ అమ్మవారికి, పాతబజార్ గౌరీశంకరాలయంలో రాజరాజేశ్వరీమాతకు విశేషాలంకారం చేశారు.

మారుతీనగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పురోహితుడు చెరుకు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళ గౌరీ వ్రతం నిర్వహించగా, 300 మంది సుహాసినీలు పాల్గొన్నారు. పూజ అనంతరం లక్కీ డ్రా తీశారు. అనంతరం సుమారు 600 మందికి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ సంఘం అధ్యక్షుడు యాంసాని అశోక్, సెక్రటరీ ఎలుగూరి మధు, కోశాధికారి మోటూరి ఆంజనేయులు, అదనపు ప్రధాన కార్యదర్శి నార్ల నవీన్, సంయుక్త కార్యదర్శి రేణికుంట ప్రవీణ్, ఉపాధ్యక్షులు వెలిచాల చంద్రమోహన్, బండ కేదారినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట సిద్ధార్థ విద్యాసంస్థల్లో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పాఠశాల ఆవరణ మామిడితోరణాలతో అందంగా అలంకరించారు. పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి సతీమణి స్వప్నతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

శంకరపట్నం, హుజూరాబాద్, వీణవంక మండల కేంద్రాలతో పాటు మామిడాలపల్లి, రామడుగు మండలం గోపాల్‌రావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులతో సందడిగా మారాయి. గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యాలయాల్లో విద్యార్థినులు వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.

అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 16 : విదేశీ విశ్వవిద్యాలయాల్లో మొదటి ఏడాది చదువుతున్న జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఉపకార వేతనాలు పొందేందుకు ఈనెల 16 నుంచి అక్టోబర్ 13లోగా www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు ఎం.నగైలేశ్వర్ పేర్కొన్నారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్ దేశాల్లోని వర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇతర వృత్తి కోర్సుల్లో చదువాలనుకుంటున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాదికి రూ.5లక్షలకు ఆదాయం మించని కుటుంబాలకు చెందిన వారు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో దరఖాస్తులు పొంది ఉండి, పాస్‌పోర్టు వీసా కలిగి ఉన్న వారు ఈ పథకానికి అర్హులని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 16: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ నెల 20వ తేదీలోగా తమ దరఖాస్తులు ఎంఈవోలకు అందజేయాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గంగాధర, ఆగస్టు 16: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. గట్టుభూత్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రాముఖ్యత, న్యూట్రీ గార్డెన్స్, పరిసరాల పరిశుభ్రత, మంచి నీటి వసతులు, రక్తహీనత వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో జనార్దన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు అనంతలక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే ఆందోళన తప్పదు

తెలంగాణచౌక్, ఆగస్టు 16: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేదంటే ఆందోళనలు తప్పవని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. నగరంలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఏడు వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నాయకులు సాగర్, హేమంత్, సందీప్‌రెడ్డి, ఆదిత్య, సంతోష్ పాల్గొన్నారు.

ఏఎల్ఎంలుగా ఉద్యోగోన్నతి

సైదాపూర్, ఆగస్టు 16: విద్యుత్ శాఖలో మండలంలో పనిచేస్తున్న ఆరుగురు జేఎల్ఎంలు ఏఎల్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందినట్లు ఏఈ బొమ్మ ఆంజనేయులు తెలిపారు. మండలకేంద్రంలో ఉద్యోగోన్నతి పొందిన రాజకొమురెల్లి, కార్తీక్, శ్రీకాంత్, దేవరాజు, శ్రీనివాస్, భువన్‌కు ఏఈ ఉద్యోగోన్నతి పత్రాలను అందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 16 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తూ.. తరలిస్తున్న వారిపై పట్టణ సీఐ జి.తిరుమల్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుగుల గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా టూవీలర్‌పై బియ్యం బస్తాలతో వస్తున్న తిరుపతి అనే వ్యక్తి, పోలీసులను చూసి పారిపోసాగాడు. దీంతో సిబ్బందితో పోలీసులు వెంబడించి అతడిని పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని ఎక్కడ అమ్ముతున్నాడో.. ఆరా తీయగా కందుగుల గ్రామంలో ఉన్న మహాలక్ష్మీ రైస్ మిల్ వద్దకు పోలీసులను తీసుకెళ్లాడు. రైస్ మిల్‌లో అప్పటికే నిల్వ ఉంచిన మొత్తం ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని, టూవీలర్‌ను సీజ్ చేశారు. రైస్ మిల్ ఓనర్, బండి నడిపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పేదలకు డబ్బు ఆశజూపి.. దళారులు బియ్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దొడ్డు బియ్యాన్ని మర ఆడించి.. నూకలు చేసి కోళ్ల ఫారాలు, పక్కరాష్ట్రాల్లో ఉన్న లిక్కర్ కంపెనీలకు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ దందా భారీ ఎత్తున జరుగుతున్నా.. అధికారులు, చూసీ చూడనట్టు ఉంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా ముందస్తు రాఖీ వేడుకలు

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 16: పట్టణంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పనా సిస్టర్, శ్రీవాణి సిస్టర్ బీఆర్ఎస్ నాయకుడు గందె శ్రీనివాస్, హెడ్ పోస్టాఫీస్‌లో పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

లిఫ్ట్ అందుబాటులోకి వచ్చేదెప్పుడో?

బస్టాండ్‌లో అర్థాంతరంగా పనులు నిలిచిపోయిన లిఫ్ట్

జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఆవరణలో సిబ్బంది సౌకర్యం కోసం చేపట్టిన లిఫ్ట్ ఏర్పాటు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. హైదరాబాద్ తర్వాత అతిపెద్దదైన కరీంనగర్ బస్టాండ్ ప్రాంగణంలో మూడు అంతస్తుల్లో జోనల్ ఈడీ, ఆర్ఎం, డీఎంల కార్యాలయాలతో పాటు వివిధ విభాగాలకు చెందిన ఆఫీసులు ఉన్నాయి. నిత్యం జోనల్ పరిధిలో ఆర్టీసీ సిబ్బంది వివిధ పనులపై వందల సంఖ్యలో జిల్లా కేంద్ర కార్యాలయానికి వస్తుంటారు. మూడంతస్తులు ఎక్కి దిగడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో రూ.22 లక్షలతో ఎనిమిది నెలల క్రితం లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టగా, సాంకేతిక సమస్య కారణంగా వాటిని నిలిపి వేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని త్వరగా లిఫ్ట్ పనులను పూర్తి చేయించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

-తెలంగాణచౌక్, ఆగస్టు 16

విధుల్లో అలసత్వం వద్దు: అదనపు కలెక్టర్

ఏరియా దవాఖానలో ఓపీ విభాగాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 16: పట్టణంలోని ఏరియా దవాఖానను శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో వైద్యుల కొరత, సరైన వైద్యం అందడం లేదని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో తనిఖీకి వచ్చిన ఆయన, దవాఖానలోని అన్ని విభాగాల్లో కలియదిరుగుతూ పరిశీలించారు. డైలీ ఓపీ ఎలా ఉంటుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కేసులపై డాక్టర్లను ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్‌లో నూతనంగా వచ్చిన వైద్యపరికరాలను పరిశీలించారు. ల్యాబ్, ఎమర్జెన్సీ సేవలు, డెలివరీ సెక్షన్‌లో పేషెంట్లకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా విధులకు హాజరుకాని వారిపై అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ఉద్యోగులను హెచ్చరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు రేపు

కలెక్టరేట్, ఆగస్టు 16: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఈనెల 18న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎం.అనిల్ ప్రకాశ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో ఉదయం 10.30 గంటలకు జరుగనున్న ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని, శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

నాగులమల్యాలలో రైతులకు శిక్షణ

కొత్తపల్లి, ఆగస్టు 16 : వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ దత్తత గ్రామమైన మండలంలోని నాగులమల్యాలలో శుక్రవారం హైడ్రోపోనిక్స్, వరిలో తడి పొడి పద్ధతిపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బద్దిపల్లి రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో దత్తత గ్రామ ఇన్‌చార్జి డా. జీ ఉషారాణి పాల్గొని, మక్కలో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. మరో శాస్త్రవేత్త డా. పీ మధుకర్‌రావు వరిలో తడి పొడి పద్ధతిలో సాగుపై అవగాహన కల్పించారు. హైడ్రోపోనిక్స్ గురించి ఉద్యానవనశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ భవ్య వివరించారు. వ్యవసాయాధికారులు డా. మదన్ మోహన్‌రెడ్డి, డా. రాజేంద్రప్రసాద్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడికి సన్మానం

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 16: జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కన్న కృష్ణ, కోశాధికారి పడకంటి శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నాయకుడు గందె శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. పట్టణానికి జిల్లా కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించాలని కోరగా, నూతన అధ్యక్షుడు సానుకూలంగా స్పందించినట్టు గందె శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని విడదీయొద్దని వినతి

గన్నేరువరం, ఆగస్టు 16: ప్రభుత్వం ఇటీవల గన్నేరువరం మండలం గుండ్లపల్లి ఎక్స్ రోడ్డును ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా, గుండ్లపల్లికి చెందిన పలువురు గ్రామస్తులు గ్రామాన్ని రెండుగా విడదీయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, సత్యనారాయణ, రాంరెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో వివాహిత మృతి

శంకరపట్నం, ఆగస్టు 16 : తాడికల్ గ్రామానికి చెందిన ఓ వివాహిత జ్వరంతో బాధపడుతూ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన సాయిల్ల స్వప్న (28) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా, కుటుంబ సభ్యులు ఈ నెల 13న మండల కేంద్రంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు చికిత్సకు తీసుకువచ్చారు. అక్కడ ఆయన ఫ్లూయిడ్స్ పెట్టి, ఇంజక్షన్‌లు వేశాడు. జ్వరం తగ్గకపోవడంతో కరీంనగర్ ప్రైవేట్ దవాఖానకు రెఫర్ చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచనతో మరో ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా స్వప్న మృతి చెందింది. కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతురాలికి భర్త సాయిల్ల అనిల్‌తో పాటు 4వ, 2వ తరగతి చదువుతున్న ఇద్దరు కొడుకులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఆగస్టు 16: నగరంలో సబ్ స్టేషన్లలో మెయింటనెన్స్, విద్యుత్ తీగల కిందున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1, టౌన్-2 ఏడీఈ లు నరేందర్, సుధీర్ కుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వావిలాల పల్లె, జ్యోతినగర్, క్రిస్టియన్ కాలనీ ఐబీ, సివిల్ హాస్పిటల్, బ్యాంకు కాలనీ, మెహర్ నగర్, వరలక్ష్మీ నగర్, కోర్టు రోడ్డు, జగిత్యాల రోడ్డు, సుభాష్ నగర్, మంచిర్యాల ఎక్స్ రోడ్, కిసాన్ నగర్, తీగలగుట్ట పల్లె, హౌసింగ్ బోర్డు, వెంకట సాయి, ఎల్లమ్మ ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు సంతోష్ నగర్, భాగ్యనగర్, శక్తి టెంపుల్ ఏరియా, విద్యానగర్, ఆదిత్యనగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, జ్యోతి నగర్, విజయ దుర్గ కాలనీ, కొత్త లేబర్ అడ్డా, ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టర్ కాంప్లెక్స్, కలెక్టర్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రాంతం, బస్టాండ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, మార్వాడీ టెంపుల్, ధోబీవాడ, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఏరియా, ముకరంపురలో కొంత ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సుడా చైర్మన్‌ను సత్కరించిన టీఎన్జీవో నాయకులు

కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న టీఎన్జీవో నాయకులు

కొత్తపల్లి, ఆగస్టు 16 : సుడా చైర్మన్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని టీఎన్జీవో నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సుడా కార్యాలయంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, సుడా పరిధిలోని పంచాయతీల్లో ఇంటి పర్మిషన్ల విషయంలో ప్రజలు, పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయనకు విన్నవించారు. కాగా, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని సుడా చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నాయకులు నరసింహస్వామి, ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, హర్మేందర్ సింగ్, మారుపాక రాజేశ్ భరద్వాజ్ పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేయాలి

శంకరపట్నం: కల్వల ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

శంకరపట్నం, ఆగస్టు 16: రైతులు, మత్స్యకారులకు వరప్రదాయని అయిన కల్వల ప్రాజెక్టుకు యుద్ధ ప్రాతిపదికన శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల బీజేపీ నాయకులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. శంకరపట్నం, వీణవంక మండలాల్లో మొత్తం 2030 ఎకరాలకు సాగునీరు అందించే కల్వల ప్రాజెక్టు గతేడాది గండి పడినప్పటి నుంచి వట్టి పోయిందన్నారు. హుస్నాబాద్, సైదాపూర్, శంకరపట్నం మండలాల పరిధిలో 422 కిమీ మేర క్యాచ్‌మెంట్ ఏరియాను కలిగి ఉన్న ఈ ప్రాజెక్టు, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా చుక్క నీరు లేని స్థితికి చేరుకుందన్నారు. ప్రాజెక్టులో పూర్తిగా పూడికతో నిండి ఉండమే కాక, ఇటీవల వచ్చిన వరదతో వందలాది ఎకరాలు ముంపునకు గురి కావడంతో రైతులు ఎంతగానో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు, మత్స్యకారులకు ఎంతో ఉపయుక్తమైన ప్రాజెక్టుకు ఇప్పటికైనా శాశ్వత మరమ్మతు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అనిల్, సీనియర్ నాయకులు సంపత్‌రావు, అలివేలి సమ్మిరెడ్డి, సుధాకర్, దండు కొమురయ్య, గౌతమ్‌రెడ్డి, దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హమ్ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవం

హౌసింగ్ బోర్డు కాలనీ, ఆగస్టు 16: నగరంలో హమ్ స్వచ్ఛంద సంస్థ పదో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రఘురామన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొమ్మిది సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న హమ్ సంస్థ సభ్యులందరినీ ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పేద అథ్లెట్ క్రీడాకారుడు ఎం వినయ్‌కు స్పైక్ షూ కొనుగోలు కోసం సంస్థ తరఫున రూ.5 వేల నగదు, జ్ఞాపిక అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్, అడ్వైజర్ డాక్టర్ అనంతం, సహదేవ్, కార్యదర్శి కుంటాల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కొండ కింది వేణుగోపాల్ శర్మ, నక్క రాఘవేందర్, ట్రెజరర్ తోడుపునూరి తిరుపతి, జీ శ్రీధర్ రెడ్డి, సభ్యులు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సమత, డాక్టర్ జీ శ్రీనివాస్, టీ అనిల్, బి. తిరుపతి, యూ జలపతి, జె. రమణ పాల్గొన్నారు.

లైంగిక దాడులపై అప్రమత్తంగా ఉండాలి

శంకరపట్నం, ఆగస్టు 16 : ఇటీవల మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ జెండర్ స్పెషలిస్ట్, సూపర్‌వైజర్ కవిత సూచించారు. శుక్రవారం గ్రామసభలో భాగంగా కేశవపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు వేధింపులు లేని సురక్షితమైన వాతావరణంలో పెరిగేలా చూడాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉందన్నారు. ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ మొబైల్ ఫోన్‌లు, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సోని, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో శ్రావణ శుక్రవారం, రాఖీ వేడుకలు

నరేందర్ రెడ్డికి రాఖీ కడుతున్న విద్యార్థిని

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 16: జిల్లా కేంద్రంలోని వావిలాల పల్లెలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్‌లో శ్రావణ శుక్రవారం విశిష్టత తెలిపేలా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ముందస్తు రాఖీ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి కార్యక్రమాలు ప్రారంభించి, శ్రీమహాలక్ష్మీకి పూజలు చేశారు. అనంతరం రాఖీ పౌర్ణమి వేడుకల్లో భాగంగా, రక్షా బంధన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయినులు, విద్యార్థినులు నరేందర్ రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బండి సంజయ్ విదేశాంగ విధానమేంటో తెలుసుకో..

- అవగాహన రాహిత్యంతో అవాకులు, చవాకులు పేల్చకు
- రాహుల్ గాంధీకి క్షమాపణలు చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ఫైర్

రాంనగర్, ఆగస్టు 16: కేంద్ర మంత్రి బండి సంజయ్ అసలు విదేశాంగ విధానం అంటే ఏంటో తెలుసుకొని మాట్లాడాలని, సంచలనాల కోసం అవాకులు, చవాకులు మాట్లాడడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు హెచ్చరించారు. బండి సంజయ్ రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం రాజేందర్ రావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. చైనా విధానం, విదేశాంగ విధానంపై నీకు ఏమైనా పరిజ్ఞానం ఉందా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అసలు గాంధీ కుటుంబం గురించి నీకేం తెలుసు అని బండి సంజయ్‌ను ప్రశ్నించారు. రాహుల్ గాంధీ చైనాకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని పేర్కొనడం బండి సంజయ్ అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనం అని మండిపడ్డారు. 1962లో చైనాకు ఇండియాకు మధ్య యుద్ధం ఎందుకు జరిగిందో తెలుసా..? అప్పుడు ప్రధానిగా వ్యవహరించిన నెహ్రూ.. చైనా ఎత్తుగడలను ఎలా తిప్పి కొట్టారో తెలుసా.. ? అని నిలదీశారు. కనీస పరిజ్ఞానం లేకుండా చరిత్ర తెలుసుకోకుండా మాట్లాడితే జనంలో నవ్వుల పాలు కావడం ఖాయమని హితవు పలికారు. దేశ సేవలో ఇందిరాగాంధీ తన బాడీగార్డ్ చేతిలో హత్యకు గురయ్యారని, అలాగే రాజీవ్ గాంధీ ఎల్‌టీటీఈ మిలిటెంట్ల చేతిలో చనిపోయారని గుర్తు చేశారు. దేశం కోసం తమ ప్రాణాలనే బలిదానం చేసిన గాంధీ కుటుంబంపై అవాకులు, చవాకులు పేల్చడం మానుకోవాలని హెచ్చరించారు. వాస్తవానికి లద్దాక్‌లోని కొన్ని ప్రాంతాలను చైనా ఆక్రమించిందని పార్లమెంట్లో రాహుల్ గాంధీ ప్రకటన చేశారని, మీడియా కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించిందని ఆరోపించారు. ఆక్రమణపై చర్చిద్దామని రాహుల్ గాంధీ పట్టుబడితే మోదీ పారిపోయారని విమర్శించారు. ఒక్క అంగుళం కూడా ఆక్రమణకు గురి కాలేదని మోదీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. లద్దాక్‌లో కొన్ని ప్రాంతాలను చైనా ఆక్రమించిందని తేల్చిన రాహుల్ గాంధీ, మరి బంగ్లాదేశ్ విషయంలో చైనాకు మద్దతుగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం తీసుకురావడంలో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కీలకంగా వ్యవహరించారని, 1971లో అప్పటి జన సంఘ్ నేత అటల్ బిహారీ వాజపేయి ఇందిరాగాంధీని పార్లమెంట్ సాక్షిగా దుర్గామాత అని కీర్తించిన విషయం బండి సంజయ్‌కు తెలియకపోవడం విచారకరమని పేర్కొన్నారు. దేశంలో రాజకీయ పార్టీల మధ్య వైరుధ్యం ఉండడం సహజమని, దేశం కోసం అన్ని పార్టీలు ఏకం కావడం చరిత్ర నిరూపించిందని.. ఈ సత్యాన్ని బండి సంజయ్ గమనించకపోవడం దారుణమని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారని, బంగ్లాదేశ్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని తాము సమర్థిస్తామని ఆయన స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఇన్ని విషయాలు జరుగుతున్నా తెలుసుకోకుండానే రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయనకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతీయులు ఏ దేశంలో ఉన్నా వారి సంక్షేమం, భద్రతా విషయంలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలిపిన రాహుల్ గాంధీ జాతీయతను అసలు శంకించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అసలు ఏ విషయంలో కనీస అవగాహన లేకుండానే మాట్లాడడం అలవాటుగా మారిందని, ఇది మార్చుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బండి సంజయ్ కుమార్‌కు సూచించారు.

జిల్లా దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ చంద్రశేఖర్

కలెక్టర్‌ను కలిసి మొక్క అందజేస్తున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్

విద్యానగర్, ఆగస్టు 16: జిల్లా దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ చంద్రశేఖర్‌ను నియమిస్తూ శుక్రవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం జిల్లాలో సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా, అనస్థీషియా వైద్యుడిగా పని చేస్తున్నారు. జిల్లా దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ చంద్రశేఖర్ కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్ఎంవో డా. నవీన, టీవీవీపీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ డా. సాయిని నరేందర్ ఉన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి

సైదాపూర్, ఆగస్టు 16: మండలకేంద్రంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు నెల్లి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఉత్సవ కమిటీలో నగర వాసులు

తెలంగాణచౌక్, ఆగస్టు16: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18న అధికారికంగా నిర్వహించనున్న సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతి వేడుకల నిర్వహణ కోసం నియమించిన రాష్ట్రకమిటీలో నగర వాసులకు చోటు లభించింది. జిల్లా నుంచి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పరశురాం గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్‌ను పాపన్న గౌడ్ జయంత్యుత్సవాల రాష్ట్రకమిటీ కన్వీనర్లుగా నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలో నిర్వహించే జయంత్యుత్సవాల్లో అధిక సంఖ్యలో గౌడ కులస్తులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ

తెలంగాణచౌక్, ఆగస్టు16: రాష్ట్ర పద్మశాలీ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్(పోపా) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా పోపా అధ్యక్షుడిగా పని చేస్తున్న పోలు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తెలంగాణ పోపా అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, కృష్ణహరి, మల్లికార్జున్, వినోద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి అభినందనల వెల్లువ



మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అంజయ్య

తెలంగాణచౌక్, ఆగస్టు 16: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ స్టేషన్ మేనేజర్‌గా పని చేస్తున్న కోమల అంజయ్య ప్రతిభా ప్రశంసాపత్రం అందుకున్నారు. గురువారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ పమేలా సత్పతి సమక్షంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అంజయ్యకు ప్రతిభా ప్రశంసాపత్రం అందించి, అభినందించారు. కాగా, ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, లీగల్‌సెల్ ఆఫీసర్ రజినీకృష్ణ, సిబ్బంది అంజయ్యను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఏసీపీ మాధవికి సన్మానం

విద్యానగర్, ఆగస్టు 16 : శ్రీనగర్ ఉమెన్స్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గడప నిరంజనీ దేవి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెడల్ అందుకున్నందుకు గానూ ఏసీపీ మాధవిని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నిరంజన్ దేవి, సెక్రటరీ కంటే గంగాభవాని, వైస్ ప్రెసిడెంట్ కడారి విజయ, ఏ పద్మావతి, సంద స్వప్న, జోన్ చైర్మన్ గడప కోటేశ్ కుమార్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి జిల్లా గౌరవ సలహాదారుగా కైరి తిరుపతిగౌడ్

మానకొండూర్, ఆగస్టు 16: సాంస్కృతి సారథి కళాకారుల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ సలహాదారుగా ముంజంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జానపద గాయకుడు కైరి తిరుపతిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి గౌడ్ ఎన్నికపై జిల్లాలోని కళాకారులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.